సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం : 28 : జూన్ : 2024



సర్కారు బడికీ ఫ్రీ కరెంట్

ప్రభుత్వ విద్యాసంస్థలకూ ఉచిత విద్యుత్ అందించాలని సర్కారు నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 4,116 పాఠశాలలకు ప్రయోజనం కలగనుంది. 8లో▸

ఎల్‌డీఎం బదిలీ

కైలాస్‌నగర్: జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ ప్రసాద్ బదిలీ అయ్యారు. అతడిని హైదరాబాద్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. కాగా, కోల్‌కతాలో పనిచేస్తున్న ఉత్పల్‌కుమార్‌ను ఆదిలాబాద్ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించగా పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/26.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రులను కలిసిన మాజీ ఎంపీ 'సోయం'



సంజయ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బాపూరావు

ఆదిలాబాద్: కేంద్ర సహాయ మంత్రులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఉయికే దుర్గాదాస్‌ను మాజీ ఎంపీ సోయం బాపూరావు గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ఆదివాసీ హక్కులు, ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర గిరిజన సహాయ మంత్రి దుర్గాదాస్‌ను బాపూరావు కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సోయం తెలిపారు.

మహేశ్‌కు ఉత్తమ పైలట్ అవార్డు ప్రదానం



మహేశ్‌కు అవార్డు ఇస్తున్న సామ్రాట్

బజార్‌హత్నూర్: ఉత్తమ సేవలందించిన బజార్‌హత్నూర్ పీహెచ్‌సీ పరిధిలోని 102 అంబులెన్స్ పైలట్ కాంబ్లే మహేశ్‌కు ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీస్ సంస్థ అందించే స్టార్ పైలట్ అవార్డును ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్‌ను మెడికల్ ఆఫీసర్లు భీంరావ్, శిల్ప అభినందించారు.

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న జిల్లా నాయకులు



ధర్నాలో పాల్గొన్న జిల్లా నాయకులు

కైలాస్‌నగర్: నీట్ పరీక్ష రద్దు చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పోతారెడ్డి తదితరులు ధర్నాకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'మెరుగైన సేవలందిస్తాం'



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఎం

ఆదిలాబాద్: ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులో మెరుగైన సేవలందించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ బస్టాండ్‌లో గురువారం గమ్యం యాప్, ఆర్టీసీ సేవలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు పాటలు పాడి ఆర్టీసీ సేవలు వివరించారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌలభ్యం కోసం గమ్యం యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. దీని ద్వారా ప్రయాణికులు గమ్యానికి ఎంత దూరంలో ఉన్నామనే సమాచారం తెలుసుకోవచ్చని వివరించారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆర్టీసీ ముందుకు సాగుతోందని వెల్లడించారు. డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్, డీఎం కల్పన, సూపరింటెండెంట్ విలాస్, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్ తదితరులున్నారు.



అతివకు అందలం!

- ఐదేళ్ల మహిళా శక్తి ప్రణాళిక ఖరారు
- ఆర్థిక వృద్ధి సాధించేలా ప్రోత్సాహం
- సూక్ష్మ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యం
- 6,866యూనిట్లు.. రూ.66.31కోట్లు
- అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం

యాక్టివిటీ	ప్రతిపాదిత యూనిట్లు	సభ్యులు	వ్యయం
మైక్రో ఎంటర్‌ప్రైజెస్	3,929	3,929	రూ.44.74కోట్లు
స్టిచ్చింగ్ సెంటర్స్	167	1,807	రూ.9.35కోట్లు
పాల జంతువులు	500	500	రూ.4.50కోట్లు
నాటుకోళ్ల పెంపకం	2,125	2,125	రూ.3.18కోట్లు
పౌల్ట్రీ మదర్ యూనిట్స్	17	17	రూ.49లక్షలు
మొబైల్ ఫిష్ అవుట్‌లెట్	1	5	రూ.10లక్షలు
మిల్క్ పార్లర్	1	1	రూ.1.90లక్షలు
మీ సేవా కేంద్రాలు	19	19	రూ.47.50లక్షలు
ఈవెంట్ మేనేజ్‌మెంట్	1	21	రూ.31.20లక్షలు
మహిళాశక్తి క్యాంటీన్లు	4	32	రూ.80లక్షలు
ప్లాస్టిక్ వేస్ట్‌మేనేజ్‌మెంట్	1	10	రూ.8లక్షలు
ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్	100	100	రూ.2కోట్లు
కస్టమ్ హైరింగ్ సెంటర్స్	1	100	రూ.25లక్షలు

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా ముందడుగు వేసేలా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సభ్యులను లక్షాధికారులను చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అందుకోసం ప్రత్యేకంగా మహిళాశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందుకు సంబంధించి వచ్చే ఐదేళ్లలో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికను జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఖరారు చేసింది. 13అంశాల్లో రూ.66.31 కోట్లతో జిల్లాలోని 8,666 మంది సభ్యులకు లబ్ధి చేకూర్చేలా కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ నెల 24న జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్ రాజర్షి షా ఈ ప్రణాళికకు ఆమోద ముద్ర వేశారు. బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందించేలా శ్రద్ధ వహిస్తూ కార్యాచరణను సాధించేదిశగా అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ఐదేళ్లలో రూ.66 కోట్లు

ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందజేస్తూ అండగా నిలుస్తోంది. వీటితో పాటు కుట్టు శిక్షణ కేంద్రాలు, చిన్నతరహా పరిశ్రమలు, పాల విక్రయాలు, పౌల్ట్రీ, మీ సేవా కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితర 15 రకాల యూనిట్లు నెలకొల్పడం ద్వారా వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేయవచ్చని ప్రభుత్వం భావించింది. మహిళాశక్తి కార్యక్రమం కింద ఐదేళ్లలో వీలైనంత ఎక్కువ మంది సభ్యులకు లబ్ధి చేకూర్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించింది. జిల్లాలోని 17 మండలాల పరిధిలో 557 గ్రామ సమాఖ్య సంఘాలుండగా 10,942 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటి పరిధిలో 1,17,399 మంది సభ్యులున్నారు. ఇందులో సంఘాలను పటిష్టంగా నడుపుతూ రెగ్యులర్‌గా పొదుపు చెల్లించే సభ్యులకు లబ్ధి చేకూర్చేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. 13 అంశాల్లో 8,666 మంది సభ్యులకు ప్రయోజనం కలిగేలా రూ.66.31 కోట్ల వ్యయంతో కూడిన 6,866 యూనిట్లను అందించేలా ప్రణాళిక రూపొందించారు. దాదాపు అన్ని యూనిట్లు.. అన్ని మండలాలకు అందేలా ప్రణాళిక తయారు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన 15 యూనిట్లలో సోలార్ యూనిట్లు, ప్లగ్ ప్లే మినహా 13 అంశాల్లోని యూనిట్లను రూపొందించారు.

సూక్ష్మ పరిశ్రమలకు ప్రాధాన్యం

ఐదేళ్లలో అమలు చేయనున్న మహిళాశక్తి ప్రణాళికలో అధికారులు సూక్ష్మ పరిశ్రమలు (మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌కు) అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. 17 మండలాల్లోని 184 గ్రామ సమాఖ్యల్లోని సభ్యులకు లబ్ధి చేకూర్చేలా ఒక్కో మండలంలో 219 చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశారు. దాని తర్వాత ఒక్కో మండలంలో 10 కుట్టు శిక్షణ కేంద్రాలు ఉండేలా 318 గ్రామ సమాఖ్యలను కవర్ చేశారు. నాటు కోళ్ల పెంపకానికి సంబంధించి ఒక్కో మండలంలో 118 మంది చొప్పున 170 గ్రామ సమాఖ్యలు కవరయ్యేలా ప్రణాళిక తయారు చేశారు. మదర్ పౌల్ట్రీ యూనిట్లను ప్రతీ మండలానికి ఒకటి చొప్పున, ఉట్నూర్ మండల కేంద్రంలో మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్, మిల్క్ పార్లర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆదిలాబాద్ రూరల్, బేల, బోథ్, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లో రెండు చొప్పున, బజార్‌హత్నూర్, భీంపూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, జైనథ్, నార్నూర్, సిరికొండ, తాంసి, శ్యాంపూర్‌లో ఒక్కో మీ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఆదిలాబాద్ రూరల్ మండలంలో అమలు చేయాలని భావిస్తున్నారు. బేల, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నేరడిగొండ, ఉట్నూర్ మండలాల్లో ఒక్కో మండలానికి 20 చొప్పున వంద యూనిట్లు ఏర్పాటు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను బేల మండలంలో ఏర్పాటు చేసేలా ప్రతిపాదించారు. బజార్‌హత్నూర్, సిరికొండ మండలాల్లో 27 చొప్పున, మిగతా 15 మండలాల్లో 28 చొప్పున పాలకు సంబంధించి గేదెలు, ఆవులను అందించేలా ప్రణాళిక తయారు చేశారు. జిల్లా కేంద్రంలో మహిళాశక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మహిళా సాధికారత కోసమే..



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మహిళా సాధికారత దిశగా మహిళాశక్తి ప్రణాళిక రూపొందించాం. ఐదేళ్లలో రూ.66.31 కోట్లతో 6,866 యూనిట్లు నెలకొల్పేలా ప్రణాళిక సిద్ధం చేశాం. నిర్దేశిత లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతాం. మహిళాశక్తి క్యాంటీన్లు, మిల్క్ పార్లర్‌ను త్వరలోనే ఏర్పాటు చేసి ప్రారంభిస్తాం. మిగతా యూనిట్లన్నింటినీ దశలవారీగా ఏర్పాటు చేసి ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఆర్థికాభివృద్ధికి అండగా ఉంటాం. వారు కూడా ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలి.

– సాయన్న, డీఆర్డీవో

ఖాకీ బదిలీలు..!

- ఎన్నికల విధులకు ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చినవారికి..
- దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్నవారికి కూడా..
- త్వరలో సీఐల బదిలీలు.. ఆ తర్వాత ఎస్సైల ట్రాన్స్‌ఫర్లు



సాక్షి, ఆదిలాబాద్: ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన పోలీస్ అధికారులు బదిలీ కానున్నారు. దీర్ఘకాలంగా ఒకేచోట ఉన్నవారికీ స్థానభ్రంశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. మొదట సీఐలు, ఆ తర్వాత ఎస్సైల ట్రాన్స్‌ఫర్లు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో సీఐల బదిలీలు జరిగాయి. ఈ జిల్లాలోనూ బదిలీలు జరగాల్సి ఉండగా, కొన్ని కారణాలతో కొద్దిరోజులు వాయిదా వేసినట్లు సమాచారం. కాగా, మొదట సీఐల బదిలీలు జరగనుండగా, భారీ ప్రక్షాళనలో భాగంగానే ఈ జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఆదిలాబాద్‌రూరల్, జైనథ్, బోథ్, ఇచ్చోడ, ఉట్నూర్ సర్కిళ్లున్నాయి. ఆయా సర్కిళ్ల సీఐల పర్యవేక్షణలో, ఇక ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్, మహిళా పోలీస్‌స్టేషన్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) పర్యవేక్షణలో కొనసాగుతాయి. ఇక జిల్లా మొత్తంగా 21 పోలీస్‌స్టేషన్లున్నాయి. ఎస్పీ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్సైలు, పోలీస్ యంత్రాంగం లా అండ్ ఆర్డర్‌ను పర్యవేక్షిస్తారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు పలువురు సీఐలు, ఎస్సైలు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లడం, ఇతర జిల్లాల నుంచి పలువురు ఇక్కడికి రావడం తెలిసిందే. ప్రస్తుతం ఎన్నికలు ముగియగా మళ్లీ ఆయా పోలీస్ అధికారులు బదిలీపై వెళ్లనున్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండడంతో..

సాధారణంగా పోలీస్‌శాఖ బదిలీలు అనగానే మొదట గుర్తుకువచ్చేది పైరవీలు. అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు తమకు అనుకూలంగా ఉండే పోలీస్ ఆఫీసర్లకు తమ ప్రాంతంలో పోస్టింగ్ కేటాయించేలా ఒత్తిడి తీసుకురావడం పరిపాటి. అయితే జిల్లాలో ప్రధానంగా ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే ఒకరే అధికార పార్టీకి చెందినవారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోనూ ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్నారు. ఈ నేపథ్యంలో పోలీస్‌శాఖలో బదిలీల విషయంలో అంతగా ఒత్తిడి ఉండకపోవచ్చనే ప్రచారం ఉంది. కాగా, సీఐలకు సంబంధించి జోన్ ఐజీ స్థాయిలో బదిలీలుంటాయి. బాసర జోన్ పరిధిలో ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ వస్తాయి. ప్రస్తుతం నిజామాబాద్ ఐజీ పోస్టు ఖాళీగా ఉండగా, మల్టీజోన్ ఐజీ-1 వరంగల్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. సీఐల బదిలీలు మల్టీజోన్ ఐజీ పర్యవేక్షణలోనే జరిగే అవకాశాలున్నాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇక ఎస్సైలకు సంబంధించి బాసర జోన్ డీఐజీ నుంచి బదిలీలు చేపట్టనున్నారు.

సమస్యల పరిష్కారానికే 'వేదిక'



సమస్యలు వింటున్న పీఎఫ్ అధికారులు

కైలాస్‌నగర్: ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించేందుకే ప్రతీ నెల 27వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ నవీన్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం 'ఈపీఎఫ్ నిధి ఆప్‌కే నికత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హాజరై తమ సమస్యలు తెలుపగా.. పరిష్కరిస్తామని అధికారులు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాటాదారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని, సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈపీఎఫ్ ఎస్ఎస్ఏ నరేశ్, డీఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి అందె గంగాధర్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి గ్రామంలో గల యూపీఎస్‌ను డీఈవో ప్రణీత గురువారం తనిఖీ చేశారు. బోధన తీరు, బడిబాటలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, ప్రణాళిక ప్రకారం తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట సీఎంవో సుజాత్‌ఖాన్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా
- కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశం

కైలాస్‌నగర్: మహిళా సంఘాలకు సకాలంలో రుణాలు అందించి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి బ్యాంకుల వారీగా నిర్దేశించిన రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్షించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన రుణాలపై ఆరా తీసిన ఆయన బ్యాంకర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకులకు నిర్దేశించిన మహిళాశక్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. మహిళాశక్తి పాలసీ కింద పలు కార్యక్రమాలకు మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించామని తెలిపారు. దీనికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళాశక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళాశక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. బ్యాంకుల నుంచి సకాలంలో విరివిగా రుణాలు అందించి వారికి చేయూతనందించాలని సూచించారు. అనంతరం 2024-25 సంవత్సరానికి సంబంధించిన జిల్లా నూతన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ ప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు. సమావేశంలో కొత్త ఎల్‌డీఎం ఉత్పల్‌కుమార్, ఆర్‌బీఐ ఎల్డీవో దేబోజీ బారువా, డీఆర్డీవో సాయన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, పరిశ్రమలశాఖ జీఎం పద్మ భూషణ్‌రాజు, బీసీ సంక్షేమాధికారి రాజలింగు, డీడబ్ల్యూవో సబిత తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్లకు జిల్లా మహిళాభివృద్ధి, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా అందజేశారు. ఇప్పటివరకు జిల్లాలో 21 మందికి గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లు కలెక్టర్‌ను పూలమాల, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సంక్షేమాధికారి సబిత, ఉట్నూర్ సీడీపీవో మిల్కా తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల తర్వాతే బదిలీలు చేపట్టాలి

కైలాస్‌నగర్: ఎస్జీటీలకు పూర్తిస్థాయి ప్రమోషన్లు కల్పించాకే బదిలీలు చేపట్టాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ కోరారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లలో అర్హత గల రెండు, మూడు సబ్జెక్టుల్లో ప్రమోషన్ పొంది, ఒక పోస్టులో చేరడంతో ఖాళీలు మిగిలాయని పేర్కొన్నారు. వాటిలో సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులను భర్తీ చేయడం ద్వారా ఉన్నత పాఠశాలల్లో మిగిలిపోయే పరిస్థితి రాదని తెలిపారు. సబ్జెక్టు నిపుణుల కొరత ఏర్పడదని పేర్కొన్నారు. సంఘ బాధ్యులు గోపీకృష్ణ, నారాయణ, రాజ్‌కుమార్, మనోజ్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

ఎదులాపురం: మహిళా సాధికారిత కేంద్రం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరం, బాలరక్షక్ భవన్, కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మహిళా చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలకు పీసీ, పీఎన్‌డీటీ చట్టం గురించి వివరించారు. మిషన్ శక్తి, మహిళా సాధికారత, భేటీ బచావో భేటీ పడావో, పని చేసే చోట లైంగిక వేధింపులు తదితర చట్టాలు, పథకాలపై మహిళా సాధికారత జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద అవగాహన కల్పించారు. సంకల్ప హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ 100 డేస్ స్పెషల్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి మాట్లాడుతూ.. సఖీ కేంద్రం సేవలు, గృహ హింస చట్టంపై వివరించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం



అభివృద్ధి ప్రణాళిక చూపుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్ రూరల్: ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి, నాగోబా ఆలయాభివృద్ధికి రూ.కోటి మంజూరు చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా రాయిసెంటర్ సార్‌మెడీలు, రగల్ జెండా కమిటీ, మెస్రం వంశీయులు, అధికారులతో ఎమ్మెల్యే సమావేశమై అభివృద్ధిపై చర్చించారు. పెద్దల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి అమరుల స్తూపం, నాగోబా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. స్తూపం వద్ద అన్ని రకాల మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. స్తూపం చుట్టూ ప్రహరీ నిర్మించి, నీటి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

మధ్యవర్తులపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని బ్యాంక్‌లలో మధ్యవర్తిత్వం చేస్తూ కమీషన్లు దండుకుని రైతులను మోసగిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్యాంక్‌లలో మధ్యవర్తులే ముందుండి లావాదేవీలు నడిపిస్తున్నారని ఆరోపించారు. దీంతో బ్యాంక్ అధికారులు, రైతులు, ఖాతాదారులకు సంబంధం లేకుండా పోతోందని పేర్కొన్నారు. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించి మధ్యవర్తులపై, ప్రోత్సహిస్తున్న బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు వసంత్‌రావ్, సోనేరావ్, మల్కు, అర్జున్, కోత్మబాయి, సులోచన, కమలాబాయి ఉన్నారు.

క్లుప్తంగా

ఒకరి ప్రాణాలు కాపాడిన పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడుతున్న ఒకరి ప్రాణాలు కాపాడి పోలీసులు మానవత్వం చాటుకున్నారు. మహాలక్ష్మివాడలోని ఓ ఇంట్లో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. స్థానికుల ఫిర్యాదుతో క్షణాల్లో అక్కడికి వచ్చిన పోలీసులు ఉరితాడును తొలగించి ప్రాణాలు కాపాడారు. బాధితుడి భార్య అతనితో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది రాథోడ్ అనిల్, అజహార్ ఖాన్, తిలక్, శివప్రసాద్ పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

ఎదులాపురం: పట్టణ వన్‌టౌన్ పోలీసులు గురువారం రూ.2,10,500 విలువ చేసే గుట్కాను పట్టుకున్నట్లు ఏఎస్సై గంగాధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పట్టణంలోని ఖుర్షాపూర్‌లో గల కరణ్‌ట్రేడర్స్‌లో తనిఖీ చేపట్టగా నిషేధిత గుట్కా లభించింది. పట్టణానికి చెందిన షేక్ అక్తర్, ఇష్తకార్, సల్మాన్ స్థానిక అస్లాం ట్రేడర్స్ నుంచి గుట్కా తీసుకొచ్చి దందా నడుపుతున్నారన్నారు. గుట్కాను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న తునికాకు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న తునికాకు

బోథ్: మండలంలోని కుచులాపూర్ బస్టాండ్ సమీపంలో గురువారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు రూ.50 వేల విలువైన తునికాకు పట్టుకున్నట్లు డిప్యూటీ రేంజ్ అధికారి సుందర్ తెలిపారు. ఉట్నూరు నుండి కుచులాపూర్, దన్నూర్ మీదుగా తునికాకు కట్టలతో సారంగాపూర్ మండలానికి వెళ్తున్న రెండు ఆటోలను కుచులాపూర్ వద్ద పట్టుకుని ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో బీట్ అధికారులు నాగరావ్, కోసేరావు, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతి చెందిన గేదె

లక్ష్మణచాంద: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని చామన్‌పెల్లిలో చోటు చేసుకుంది. రాపెల్లి పెద్ద సాంబయ్య అనే రైతుకు చెందిన గేదె గురువారం ఉదయం గ్రామ సమీపంలో మేతకు వెళ్లింది. మేత మేస్తుండగా విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

సర్కారు బడికీ ఫ్రీ కరెంటు

- పాఠశాలలకు ఉచిత విద్యుత్‌పై రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం
- డిజిటల్ విద్యాబోధనకు మరింత సౌలభ్యం
- ప్రత్యేక పోర్టల్ ద్వారా పాఠశాలల అనుసంధానం
- ఉమ్మడి జిల్లాలో 4,116 పాఠశాలలకు ప్రయోజనం

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రభుత్వ పాఠశాలలు
నిర్మల్	842
ఆదిలాబాద్	1,279
మంచిర్యాల	847
కుమురంభీం	1,148
మొత్తం	4,116


ఎల్‌ఈడీ తెరపై నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 200 యూనిట్లలోపు గృహావసరాలకు వినియోగించే విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. ప్రభుత్వ విద్యా సంస్థలకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఉపాధ్యాయులు, విద్యావేత్తల నుండి వినతులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలలు, తదితర విద్యా సంస్థలకు వినియోగించే విద్యుత్‌ను కూడా ఉచితంగా అందించేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4,116 ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం దక్కనుంది. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలోని పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన కోసం ఎల్‌ఈడీ తెరలు, ప్యానల్ బోర్డులను సమకూర్చింది. ఉపాధ్యాయులకు మార్కుల నమోదు, విద్యార్థుల ప్రగతి వివరాలు, అడ్మిషన్ల వివరాలను నిక్షిప్తం చేసేందుకు ట్యాబ్‌లు కూడా అందించారు. దీంతోపాటు ప్రతీ తరగతి గదిలో ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగానూ ప్రతీ పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ అందిస్తోంది. గతంలో వీటి నిర్వహణకుగానూ విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని ప్రధానోపాధ్యాయుల నుండి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. పాఠశాల నిర్వహణ గ్రాంట్లు పెద్ద మొత్తంలో కరెంటు బిల్లుల చెల్లింపుల కోసమే వినియోగించేవారు. స్కూల్ గ్రాంట్లు కూడా సకాలంలో విడుదల కాకపోవడంతో వేల రూపాయల కరెంటు బిల్లులు బకాయిల రూపంలోనే ఉండిపోయేవి. ఉచిత విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించడంతో డిజిటల్ విద్యా బోధన పూర్తిస్థాయిలో కొనసాగేందుకు అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇక నుంచి జీరో బిల్లులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వరంగంలో ప్రాథమిక, ఉన్నత తదితర పాఠశాలలు 4,116 ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో 842, ఆదిలాబాద్ జిల్లాలో 1,279, మంచిర్యాల జిల్లాలో 847, కుమురంభీం జిల్లాలో 1,148 పాఠశాలలు ఉన్నాయి. ఉచిత విద్యుత్‌ను అందించనుండడంతో ఇక నుంచి ప్రతినెల మీటర్ రీడింగ్ తీసి జీరో బిల్లులు అందజేయనున్నారు. విద్యుత్ దుర్వినియోగం కాకుండా వీటిపై ప్రభుత్వ, విద్యుత్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. బిల్లుల మొత్తాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందిస్తే వారు విద్యుత్ శాఖ వారికి చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థ పాఠశాలలకు అందించే ఉచిత విద్యుత్ వివరాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసి ఆయా ప్రభుత్వ పాఠశాలలను అనుసంధానం చేయనున్నారు.

డిజిటల్ బోధనకు మార్గం సుగమం

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రెండేళ్ల నుంచి తరగతి గదుల్లో వినియోగించే డిజిటల్ ప్యానెల్ బోర్డులు, ఎల్‌ఈడీ తెరలు, ప్రొజెక్టర్లు, మైక్‌సెట్‌లు, ఫ్యాన్లు, లైట్లు వంటివి అందుబాటులోకి వచ్చాయి. అయితే వీటికి విద్యుత్ వినియోగం భారమవుతుందనే ఉద్దేశంతో ప్రతీరోజు బోధనాభ్యసనలో వినియోగించేందుకు ఉపాధ్యాయులు వెనుకాడేవారు. ప్రస్తుతం ఉచిత విద్యుత్ అందించనున్న నేపథ్యంలో వీటి పూర్తిస్థాయి వినియోగానికి మార్గం సుగమమైంది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సముచిత నిర్ణయం



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందివ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సముచితమైనది. గతంలో పాఠశాల గ్రాంట్లలో 80 శాతం నిధులను కరెంటు బిల్లులు చెల్లించేందుకే వినియోగించాల్సివచ్చేది. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వడంవల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుంది. – టి.నరేంద్రబాబు, పీఆర్టీయూటీఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

ఆదివాసీ మహిళకు

నంది అవార్డు


అవార్డు అందుకుంటున్న ఆత్రం సుశీల

బోథ్: మండలంలోని బాబేర గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ ఆత్రం సుశీల గోల్డెన్ నంది అవార్డు, గోల్డెన్ ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్నారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. సుశీల మహిళా సంఘం సభ్యురాలిగా ఉంటూ, గ్రామాల్లో విద్య, వైద్యం, శుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. గతంలో కూడా గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

నిర్మల్ కవికి యువ పురస్కారం


పోలీస్ భీమేష్

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర సాహితీ సంస్థ తెలంగాణ సారస్వత పరిషత్తు ఏటా అందజేస్తున్న పురస్కారానికి ఈ ఏడాది జిల్లాకు చెందిన పోలీస్ భీమేష్ ఎంపికయ్యారు. 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే తొలి పుస్తకంతో యువ పురస్కారానికి ఎంపికైనట్లు సంస్థ బుధవారం ప్రకటించింది. యువకవి గా, శిల్పిగా, చిత్రకారుడిగా బహుముఖ ప్రజ్ఞ చాటుతున్న నిర్మల్ రూరల్ మండలం అనంతపేట గ్రామానికి చెందిన భీమేష్ సాహిత్యంలోనూ రాణిస్తున్నారు. తన రచనల సమాహారాన్ని 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే కవితా సంపుటిగా పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహకారంతో ప్రచురించారు.

సినీఫక్కీలో చోరీ


యజమానితో మాట్లాడుతున్న దుండగుడు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ బంగారం దుకాణంలో గురువారం సినీఫక్కీలో చోరీ జరిగినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి దుకాణం ఎదుట ఆపారు. అందులోంచి ఒకరు దుకాణంలోకి వెళ్లి మెడలో వేసుకునే బంగారు లాకెట్ చూపమని దుకాణం యజమాని వనితను అడిగాడు. రూ.3వేల విలువగల లాకెట్‌కు రూ.వెయ్యి అడ్వాన్సుగా ఇచ్చాడు. మళ్లీ వచ్చి మిగతా రూ.2వేలు ఇచ్చి లాకెట్ తీసుకెళ్తానని నమ్మబలికాడు. ఇలా యజమానితో మాట్లాడుతునే కౌంటర్‌లో ప్లాస్టిక్ ప్యాకెట్ కవర్లో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు చేతి వేళ్ల మధ్యలో పెట్టుకుని బైక్‌పై పరారయ్యారు. యజమాని ఫిర్యాదుతో పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా దుండగులు శివాజీ చౌక్ నుంచి నంబర్‌ప్లేట్‌లేని బైక్‌పై వచ్చి ఆదిలాబాద్‌వైపు వెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చైన్ స్నాచింగ్ దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

కైలాస్‌నగర్: తాంసి, బేల పోలీసు స్టేషన్ల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. గురువారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుడిహత్నూర్ మండలం మన్నూర్‌కు చెందిన హోలాంబే అవినాష్, అదే గ్రామానికి చెందిన గిత్తే విభాష్ అలియాస్ విభన్, బజార్‌హత్నూర్‌కు చెందిన జాదవ్ ప్రదీప్‌తో పాటు ఓ బాలుడు జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 21న సిర్సన్న గ్రామ శివారులోని పంట పొలంలో మహిళ మెడలో నుంచి అవినాష్, విభాష్‌లు బంగారు గొలుసు లాక్కెల్లి ప్రదీప్‌కు రూ.5,500లకు విక్రయించారు. 22న తాంసి మండలం హస్నాపూర్ సమీపంలో రోడ్డుపై ఒంటరిగా ఉన్న రాజమ్మను బెదిరించి బంగారు గొలుసు లాక్కెళ్లి ప్రదీప్‌కు విక్రయించారు. నిందితులను అరెస్టు చేసి 10 గ్రాముల పుస్తెలతాడు, 10 గ్రాముల బంగారు గుండ్లతాడు, బజాజ్ పల్సర్ బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో రూరల్ సీఐ ఫణిదర్, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, సిబ్బంది శ్రీనివాస్, జోగిందర్ సింగ్, జైనథ్ సీఐ సాయినాథ్, తాంసి ఎస్సై శివరాం, బేల ఎస్సై రాధిక, తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలు

నేరడిగొండ: ఏడేళ్ల బాలుడిపై జరిగిన అసహజ అత్యాచార నేరం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు జడ్జి శివరామ ప్రసాద్ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. 2021 జూన్ 2న నేరడిగొండలో ఏడేళ్ల బాలుడిపై శివరాత్రి మహేష్ అనే వ్యక్తి అసహజ అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటి ఎస్సై భరత్ సుమన్ కేసు నమోదు చేయగా ఉట్నూర్ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి పరిశోధన చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

చోరీ కేసులో ముగ్గురికి కఠిన కారాగార శిక్ష

భైంసాటౌన్: ఎనిమిది దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ భైంసా కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు గురువారం తీర్పునిచ్చారు. పట్టణానికి చెందిన సోనాకాంబ్లే విజయ్, దగడే వికాస్, సద్దాం హుస్సేన్‌లపై ఉన్న ఎనిమిది చోరీ కేసులు కోర్టులో విచారణకు రాగా లైసన్ అధికారి ఫిర్దోస్ సాక్షులను ప్రవేశపెట్టారు. నేరాలు రుజువు కావడంతో వారికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఒకరి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు

ఇచ్చోడ: ఒకరి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ బోథ్ మున్సిఫ్ కోర్టు జడ్జి హుస్సేన్ గురువారం తీర్పునిచ్చినట్లు ఇచ్చోడ ఎస్సై నరేష్ తెలిపారు. 2019లో చౌహాన్ శ్రీనివాస్ అజాగ్రత్తగా ఆటో నడిపి అడేగామ గ్రామానికి చెందిన నల్లతీగాల కొండన్నను ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, లైసెన్స్‌లేని వ్యక్తికి ఆటో ఇచ్చినందుకు ఓనర్‌కు మూడునెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి హుస్సేన్ తీర్పునిచ్చారు.

ఒకరికి 14 రోజుల రిమాండ్

భైంసా: అడవి పందులు తరలిస్తున్న దిలీశ్‌కుమార్ అనే వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ భైంసా మెజిస్ట్రేట్ దేవేంద్రబాబు గురువారం తీర్పునిచ్చారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన దిలీశ్‌కుమార్ భైంసా మండలం దేగాంలో బుధవారం రాత్రి అడ వి పందులను తరలించేందుకు సిద్ధమయ్యాడు. ముందస్తు సమాచారంతో డీఆర్‌వో ఇర్ఫాన్ నొద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు లెనిన్, హరిలత, సెక్షన్ ఆఫీస ర్ శ్రీనివాస్ అతన్ని అదుపులోకి తీసుకుని భైంసా కోర్టులో హాజరు పరిచారు. భైంసా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.

జీపీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

నర్సాపూర్ (జి): మండలంలోని చాక్ పల్లి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైనట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు. బ్యాటరీ విలువ సుమారు రూ.8 వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

చట్టాలు.. సరికొత్తగా..

- జూలై 1 నుంచి అమలు
- ఫిర్యాదుల నుంచి సమన్ల జారీ వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే..
- సత్వర న్యాయానికి రెండే వాయిదాలు
- హేయమైన నేరాల దృశ్యాలకు వీడియోగ్రఫీ తప్పనిసరి
- పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా జీరో ఎఫ్ఐఆర్
- అధికారులు, సిబ్బందికి పది రోజుల పాటు శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

నిర్మల్‌టౌన్: జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులు, సమన్ల జారీ వంటివన్నీ ఇకపై ఆన్‌లైన్ ద్వారానే జరగనున్నాయి. దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి చట్టాలలో భారీ మార్పులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో ప్రభుత్వం భారీ మార్పులు చే సింది. 'భారతీయ న్యాయ సంహిత-2023, భారతీ య నాగరిక సురక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్య అధినియమ్-2013గా మార్చింది. ఈ కొత్త చట్టాల అమలులో పలు మార్పులు కనిపించనున్నా యి. ఇకపై అన్నీ ఎలక్ట్రానిక్ మాధ్యమంలోనే జరగనున్నాయి. హేయమైన నేరాలకు సంబంధించిన నేర దృశ్యాలను తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేస్తారు. ఈ కొత్త చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 13 నుండి 23 వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లాలోని 20 పోలీస్ స్టేషన్లో పరిధిలోని 508 మంది పోలీస్ అధి కారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించా రు. శిక్షణకు సమన్వయ అధికారిగా డీసీఆర్బీ సీఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ రవికుమార్, శిక్షకులుగా సీ ఐలు నవీన్ కుమార్, సైదారావు, ఎస్సైలు సాయి కు మార్, సాయి కిరణ్, జ్యోతిమని వ్యవహరించారు.

కొత్త చట్టాలు ఇవే..

- బాధితుడు ఇకపై నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేయవచ్చు.
- జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం ఎవరైనా పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చు.
- అరెస్టయిన బాధితుడు విషయాన్ని తన స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులకు తెలియజేసే వీలుంటుంది. దీనివల్ల బాధితుడికి తక్షణసాయం లభిస్తుంది. అరెస్ట్ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు, జిల్లా హెడ్ క్వార్టర్‌లో బహిరంగంగా ప్రదర్శిస్తారు. దీనివల్ల బాధిత కుటుంబ సభ్యులు, స్నేహితులకు ముఖ్యమైన సమాచారం తెలిసే వీలుంటుంది.
- హేయమైన నేరాల్లో వీడియోగ్రఫీ తప్పనిసరి. దీనివల్ల దర్యాప్తులో నాణ్యత పెరిగే అవకాశం ఉంది.
- మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు రెండు నెలల్లోనే పూర్తి కావాలి. బాధిత మహిళలు, చిన్నారులకు ఉచితంగా ప్రాథమిక చికిత్స, వైద్య చికిత్స అందించాల్సి ఉంటుంది.
- సమన్లను ఇకపై నేరుగా వెళ్లి ఇవ్వాల్సిన పనిలేదు. ఆన్‌లైన్‌లో పంపించవచ్చు. తద్వారా పేపర్ వర్క్ తగ్గించి, అన్ని భాగస్వామ్య పక్షాల మధ్య సమాచారం అందించేలా ఈ చట్టాన్ని రూపొందించారు.
- మహిళలపై నేరాల విషయంలో బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేయాలి. వారు లేనిపక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి.
- బాధితులతో పాటు నిందితులకు కూడా ఎఫ్ఐఆర్ కాపీ నకలును ఉచితంగా అందిస్తారు. పోలీస్ రిపోర్ట్, చార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లో పొందవచ్చు.
- సాక్షుల భద్రతను వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకొని, సాక్షుల పరిరక్షణ పథకాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలి.
- అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి.
- మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. వారు తాము నివసిస్తున్న చోటే పోలీసుల సాయం పొందవచ్చు.
- స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్తులకు సమాజ సేవ చేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి.
- న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెంపొందించడంతో పాటు వేగంగా కేసుల పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ఈ చట్టాలు రూపొందించబడ్డాయి.

పోలీసులకు అవగాహన ఉండాలి



కొత్త చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలి. అప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలుగుతారు. అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరం. అప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అవసరాన్నిబట్టి ప్రజా భద్రతకోసం చట్టాలను రూపకల్పన చేయడం జరిగింది. కొత్త చట్టాలపై జిల్లా పోలీసులకు విడతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించాం. – జానకీ షర్మిల, నిర్మల్ ఎస్పీ

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

తాంసి: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు భీంపూర్ ఎస్సై ఎండీ కలీమ్ తెలిపారు. తాంసి(కె) గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 25న రాత్రి 12 గంటల సమయంలో మూత్రవిసర్జన కోసం బయట కొట్టంలోకి వెళ్లగా అదే గ్రామానికి చెందిన రవీందర్ అనే వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు మహిళ భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


ఇంటి భోజనం తింటున్న విద్యార్థులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడంతో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు విచ్చేసి భోజనాన్ని పరిశీలించారు. ఇక నుంచి అలా జరగకుండా చూసుకుంటామని మధ్యాహ్న భోజన కార్మికులు తెలపడంతో శాంతించారు. ఇలా జరగడంతో కొందరు విద్యార్థులు గురువారం ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.